04-09-2020 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

## " మధురమైన పిల్లలారా - మీరెప్పుడైతే పుష్పాలుగా అవుతారో, అప్పుడు ఈ భారతదేశము ముళ్ళ అడవి నుండి సంపూర్ణ పుష్పాల తోటగా అవుతుంది, మిమ్ములను పుష్పాలుగా చేసేందుకు బాబా వచ్చారు "

**ప్రశ్న:-** మందిరానికి అర్హులుగా అయ్యేందుకు ఏ విషయాల పై విశేష గమనమివ్వాలి ?

**జవాబు:-** మందిరానికి అర్హులుగా అవ్వాలంటే నడవడిక పై విశేష గమనమివ్వండి - నడవడిక చాలా మధురంగా, రాయల్‌గా ఉండాలి. ఇతరులకు అనుభవమయ్యేంత మధురంగా ఉండాలి. అనేకమందికి తండ్రి పరిచయమునివ్వాలి. మీ కళ్యాణం చేసుకునేందుకు బాగా పురుషార్థము చేసి, సేవలో లగ్నమై ఉండాలి.

**పాట:- ఈ ప్రపంచం మారినా మేము మారము....(బదల్ జాయే దునియా న బదలేంగే హమ్....)**

**ఓంశాంతి.** తండ్రి బ్రహ్మ ద్వారా అర్థము చేయిస్తున్నారని ఆత్మిక పిల్లలకు తెలుసు. బ్రహ్మ రథము ద్వారానే అర్థం చేయిస్తారు. శ్రీమతమును అనుసరించి ఈ భారత భూమిని పతితము నుండి పావనంగా తయారు చేస్తామని మనము ప్రతిజ్ఞ చేస్తాము. ముఖ్యంగా భారతదేశానికి జనరల్‌గా, పూర్తి ప్రపంచమంతటికీ మనము పతితుల నుండి పావనులుగా తయారయ్యే దారి తెలుపుతున్నాము. ఇది ప్రతి ఒక్కరి బుద్ధిలో తప్పకుండా ఉండాలి. తండ్రి అంటున్నారు - డ్రామానుసారము మీరు పుష్పాలుగా అయినప్పుడు మరియు సమయం వచ్చినప్పుడు తోట సంపూర్ణంగా తయారవుతుంది. తోట యజమాని అని నిరాకారుడినే అంటారు. తోటమాలి అని కూడా నిరాకారుడిని అంటారు, సాకారుని కాదు. తోటమాలి కూడా ఆత్మనే, శరీరము కాదు. యజమాని కూడా ఆత్మనే. తండ్రి శరీరము ద్వారానే అర్థం చేయిస్తారు కదా. శరీరంతో పాటు ఉన్నవారినే తోటమాలి, తోట యజమాని అని అంటారు. వారు ఈ విశ్వాన్ని పుష్పాల తోటగా చేస్తారు. తోటగా ఉన్నప్పుడు అక్కడ దేవీ దేవతలుండేవారు. అక్కడ ఎలాంటి దుఃఖమూ లేదు. ఇక్కడ ముళ్ళ అడవిలో దుఃఖముంది. రావణ రాజ్యము ముళ్ళ అడవి. వెంటనే ఎవ్వరూ పుష్పాలుగా అవ్వలేరు. దేవతల ముందుకు వెళ్ళి మేము జన్మ-జన్మాంతరాల పాపులము, అజామిళులము అని గానము చేస్తారు. ఇప్పుడు మీరు వచ్చి మమ్ములను పుణ్యాత్ములుగా చేయండని ప్రార్థిస్తారు. ఒకప్పుడు మనము పుణ్యాత్ములుగా ఉండేవారము. ఇప్పుడు పాపాత్ములుగా ఉన్నామని కూడా అర్థము చేసుకున్నారు. ఏదో సమయంలో పుణ్యాత్ములుగా ఉండేవారము, ఇప్పుడు ప్రపంచంలో కేవలం పుణ్యాత్ముల చిత్రాలు మాత్రమే ఉన్నాయి. రాజధానిలో ముఖ్యమైనవారి చిత్రాలు మాత్రమున్నాయి. వారిని అలా తయారు చేసినవారు శివబాబా. వారి చిత్రము కూడా ఉంది. అంతే ఇతరుల ఎవరి చిత్రాలూ లేవు. వీరిలో శివుడిని పెద్ద లింగముగా తయారు చేస్తారు. ఆత్మ నక్షత్రము వలె ఉంటుందని కూడా అంటారు. కావున ఆత్మల తండ్రి కూడా అలాగే ఉంటారు కదా. కాని వారి గురించి పూర్తి పరిచయము, గుర్తింపు ఎవ్వరికీ లేదు. విశ్వములో లక్ష్మీనారాయణుల రాజ్యముండేది. వీరిని ఎవ్వరూ ఎక్కడా గ్లాని చేస్తూ వ్రాయరు. కాని కృష్ణుని అప్పుడప్పుడు ద్వాపర యుగములోకి, అప్పుడప్పుడు ఇంకెక్కడికో తీసుకెళ్తారు. లక్ష్మీనారాయణులు స్వర్గానికి యజమానులుగా ఉండేవారని అందరూ చెప్తారు. ఇది మీ లక్ష్యము. రాధా-కృష్ణులెవరో తెలియక మానవులు తికమకపడుతున్నారు. సత్యమేమిటో మనుష్యులకు తెలియదు. తండ్రి ద్వారా తెలుసుకున్నవారు దానిని ఇతరులకు అర్థం చేయించేందుకు కూడా అర్హులుగా అవుతారు. అలా లేకపోతే అర్హులుగా అవ్వలేరు. దైవీ గుణాలు ధారణ చేయలేరు. భలే ఎంతగా అర్థం చేయించినా తెలుపలేరు. కాని డ్రామానుసారము అలా జరగాల్సిందే. మన తనువు, మనసు, ధనముల ద్వారా శ్రీమతమునను సరించి భారతదేశానికి ఆత్మిక సేవ చేస్తున్నామని మీకు తెలుసు. ప్రదర్శని లేక మ్యూజియమ్‌లో మీరు భారతదేశానికి

ఏ సేవ చేస్తున్నారని అడుగుతారు. మనము భారతదేశానికి చాలా మంచి సేవ చేస్తున్నాము. అడవిగా ఉన్న భారతదేశాన్ని పూలతోటగా మారుస్తున్నామని మీకు తెలుసు. సత్యయుగమంటే తోట. ఇది ముళ్ళ అడవి. ఒకరికొకరు దు:ఖము కలిగించుకుంటూ ఉంటారు. ఈ విషయాన్ని మీరు బాగా అర్థము చేయించవచ్చు. లక్ష్మీనారాయణుల చిత్రాన్ని కూడా చాలా బాగా తయారుచేయాలి. మందిరాలలో చాలా అందమైన చిత్రాలను తయారుచేస్తారు. కొన్ని చోట్ల తెల్లగా, కొన్ని చోట్ల నల్లగా తయారుచేస్తారు. దీని రహస్యమేమిటో ఎవ్వరికీ తెలియదు. పిల్లలైన మీకిప్పుడు ఈ విషయాలు పూర్తిగా తెలుసు. తండ్రి చెప్తున్నారు - నేను వచ్చి అందరినీ మందిరాలకు అర్హులుగా చేస్తాను. కానీ అందరూ మందిరానికి అర్హులుగా అవ్వలేరు. ప్రజలను మందిరాలకు అర్హులని అనరు. పురుషార్థము చేసి చాలా మందికి సేవ చేసిన వారికే ప్రజలుంటారు.

పిల్లలైన మీరు ఆత్మిక సమాజ సేవ కూడా చేయాలి. ఈ సేవలో మీ జీవితాన్ని సఫలం చేసుకోవాలి. నడవడిక కూడా చాలా మధురంగా, సుందరంగా ఉండాలి. ఇతరులకు కూడా మధురంగా అర్థము చేయించగలగాలి. స్వయం మీరే ముళ్ళుగా ఉంటే ఇతరులను పుష్పాలుగా ఎలా చేస్తారు? వారి బాణము పూర్తిగా తగలదు. తండ్రిని స్మృతి చేయకుంటే బాణము ఎలా తగులుతుంది? మీ కళ్యాణం కొరకు మంచి పురుషార్థము చేసి సేవలో మగ్నమవ్వండి. తండ్రి కూడా సేవ చేస్తున్నారు కదా. పిల్లలైన మీరు కూడా రాత్రింబవళ్ళు సేవ చేయండి.

రెండవది శివజయంతికి చాలామంది పిల్లలు టెలిగ్రాములు పంపుతూ ఉంటారు. వాటిని ఎవరికైనా చూపిస్తే అవి అర్థమయ్యేటట్లుండాలి. ఇక ముందు ఏం చేయాలో దాని పై పురుషార్థము చేస్తారు. చాలా మందికి తండ్రి పరిచయమిచ్చేందుకు ఏ సేవలు చెయ్యాలో సెమినార్(సదస్సు)లు చేస్తారు. ఇక్కడ చాలా టెలిగ్రాములు కూడా ఉన్నాయి. వీటిని మీరు సేవలో ఉపయోగించుకోండి. శివబాబా కేర్ ఆఫ్ బ్రహ్మ అని అడ్రస్ వ్రాస్తారు. ప్రజాపిత బ్రహ్మ కూడా ఉన్నారు. వారేమో ఆత్మలకు తండ్రి, వీరేమో శారీరిక తండ్రి. వారి ద్వారా శారీరిక రచన రచింపబడుతుంది. తండ్రి మనుష్య సృష్టికి రచయిత. ఎలా రచిస్తారో ప్రపంచంలో ఎవ్వరికీ తెలియదు. తండ్రి బ్రహ్మ ద్వారా నూతన రచన రచిస్తున్నారు. బ్రాహ్మణులు శ్రేష్ఠులు. మొట్టమొదట బ్రాహ్మణులు తప్పకుండా ఉండాలి. విరాట రూపానికి ఇది శిఖ. బ్రాహ్మణ, దేవత, క్షత్రియ, వైశ్య, శూద్రులు. మొట్టమొదట శూద్రులుగా ఉండేందుకు వీలు లేదు కదా. తండ్రి బ్రహ్మ ద్వారా బ్రాహ్మణులను రచిస్తారు. శూద్రులను ఎవరి ద్వారా ఎలా రచిస్తారు?

పిల్లలైన మీకు నూతన రచనను ఎలా రచిస్తారో తెలుసు. దత్తు చేసుకుంటారు. కల్ప - కల్పము వచ్చి శూద్రుల నుండి బ్రాహ్మణులుగా చేసి తర్వాత బ్రాహ్మణుల నుండి దేవతలుగా చేస్తారు. బ్రాహ్మణుల సేవ చాలా ఉన్నతమైనది. ఆ బ్రాహ్మణులు స్వయం వారే పవిత్రంగా లేరు అలాంటప్పుడు ఇతరులను పవిత్రంగా ఎలా చేస్తారు? ఏ బ్రాహ్మణుడూ ఏ సన్యాసికీ రాఖీ ఎప్పుడూ కట్టడు. మేము పవిత్రంగానే ఉన్నామని అంటారు, మీరు మీ ముఖాన్ని చూసుకోండి అని అంటారు. పిల్లలైన మీరు కూడా ఇతరులెవ్వరితోనూ రాఖీ కట్టించుకోరాదు. ప్రపంచములో అయితే అందరూ ఒకరికొకరు కట్టారు. సోదరి-సోదరునికి కట్టుంది. ఈ ఆచారం ఇప్పుడే ఏర్పడింది. ఇప్పుడు మీరు శూద్రుల నుండి బ్రాహ్మణులుగా అయ్యేందుకు పురుషార్థము చేస్తారు. ఈ విషయాలన్నీ అర్థము చేయించవలసి వస్తుంది. స్త్రీ - పురుషులిరువురూ పవిత్రతా ప్రతిజ్ఞ చేస్తారు. తండ్రి శ్రీమతము ద్వారా పవిత్రంగా ఎలా ఉంటున్నారో ఇరువురూ చెప్పగలరు. చివరివరకు కామ వికారము పై విజయులుగా ఉంటే పవిత్ర ప్రపంచానికి యజమానులుగా అవుతారు. పవిత్ర ప్రపంచాన్ని సత్యయుగమని అంటారు. అది ఇప్పుడు స్థాపనవుతూ ఉంది. మీరంతా పవిత్రంగా ఉన్నారు. వికారాలలో ఉన్నవారికి మీరు రాఖీ కట్టవచ్చు. ప్రతిజ్ఞ చేసి మళ్ళీ పతితులుగా అయితే రాఖీ కట్టించుకునేందుకు వచ్చారు కదా? ఏమయ్యింది

అని వారిని అడగండి. మాయతో ఓడిపోయామని చెప్తారు. ఇది యుద్ధ మైదానము. వికారము చాలా పెద్ద శత్రువు. వీటి పై విజయం పొందితే జగత్‌జీతులు అనగా రాజా - రాణులుగా అవుతారు. ప్రజలను జగత్‌జీతులని అనరు. రాజు - రాణి శ్రమ చేస్తారు కదా. మేము లక్ష్మీనారాయణులుగా అవుతామని కూడా అంటారు, వారు మళ్ళీ సీతా-రాములుగా కూడా అవుతారు. లక్ష్మీనారాయణుల తర్వాత వారి పిల్లలే వారి సింహాసనాన్ని గెలుచుకుంటారు. ఆ లక్ష్మీనారాయణులు మరో జన్మలో క్రిందికి వెళ్ళిపోతారు. భిన్న - భిన్న నామ, రూపాలతో పిల్లలకు సింహాసనం లభిస్తే, వారి నెంబరు ఉన్నతంగా పరిగణింపబడుతుంది. పునర్జన్మ తీసుకుంటారు కదా. పిల్లలు సింహాసనం పై కూర్చుంటే వారు రెండవ గ్రేడు వారిగా అవుతారు. పైనున్న వారు క్రిందకు, క్రింద ఉన్నవారు పైకి వచ్చేస్తారు. కనుక ఇప్పుడు పిల్లలు ఇలా ఉన్నతంగా అవ్వాలంటే సేవలో లగ్నమవ్వాలి. పవిత్రులుగా అవ్వడం కూడా చాలా అవసరం. తండ్రి అంటున్నారు - నేను పవిత్ర ప్రపంచాన్ని తయారు చేస్తాను. మంచి పురుషార్థము కొంతమందే చేస్తారు. ప్రపంచమంతా పవిత్రంగా అవుతుంది. మీ కొరకు స్వర్గ స్థాపన చేస్తున్నారు. ఇది డ్రామానుసారము జరిగే తీరాలి. ఇది తయారైన డ్రామా. మీరు పవిత్రులైపోతారు. తర్వాత వినాశనం మొదలవుతుంది. సత్యయుగ స్థాపన జరుగుతుంది. డ్రామానైతే మీరు అర్థము చేసుకోగలరు. సత్యయుగంలో దేవతల రాజ్యముండేది. ఇప్పుడది లేదు, మళ్ళీ అవుతుంది.

మీరు ఆత్మిక మిలటరీ. మీరు పంచ వికారాల పై విజయం పొంది జగత్‌జీతులుగా అయ్యేవారు. జన్మ-జన్మాంతరాల పాపాలు నశించేందుకు బాబా యుక్తులు తెలుపుతున్నారు. తండ్రి ఒక్కసారి మాత్రమే వచ్చి యుక్తి తెలుపుతారు. రాజధాని స్థాపన అవ్వనంత వరకు వినాశనమవ్వదు. మీరు చాలా గుప్త యోధులు(సైనికులు). కలియుగము తర్వాత సత్యయుగము వచ్చే తీరాలి. తర్వాత సత్యయుగంలో ఎప్పుడూ యుద్ధాలు జరగవు. పాత్రనభినయించే ఆత్మల పాత్రలు ముందే నిర్ణయింపబడి ఉన్నాయని పిల్లలైన మీకు తెలుసు. తోలుబొమ్మలాట తెలుసు కదా. ఆడించే విధంగా బొమ్మలు నాట్యము చేస్తూ ఉంటాయి. ఇది కూడా డ్రామానే. ఈ డ్రామాలో ప్రతి ఒక్కరికి పాత్ర ఉంది. పాత్రను అభినయిస్తూ, అభినయిస్తూ మీరు తమోప్రధానమైపోయారు. పైకి పోవునప్పుడు సతోప్రధానంగా అవుతారు. జ్ఞానమేమో ఒక సెకెండు మాత్రమే. సతోప్రధానంగా అవుతారు మళ్ళీ క్రిందపడుతూ పడుతూ తమోప్రధానంగా అవుతారు. తండ్రి మళ్ళీ పైకి తీసుకెళ్తారు. వాస్తవానికి ఆ చేపలు తీగలో వ్రేలాడుతూ ఉంటాయి. ఈ తీగలో మానవులను వెయ్యాలి. ఆ విధంగా క్రిందికి దిగుతూ, పైకి ఎక్కుతూ ఉంటారు. ఒక్కసారి పైకి ఎక్కుతారు. ఒక్కసారి పైకి పోయి క్రిందకు వచ్చేందుకు 5 వేల సంవత్సరాలు పడ్తుంది. ఈ 84 జన్మల చక్రము మీ బుద్ధిలో ఉంది. క్రిందికి దిగే కళ, మళ్ళీ పైకి ఎక్కే కళల రహస్యాన్ని ఆ తండ్రే అర్థము చేయించారు. మీలో కూడా నెంబరువారుగా అర్థం చేసుకున్నారు. దాని ప్రకారం పురుషార్థము చేస్తారు. ఎవరైతే తండ్రిని స్మృతి చేస్తారో, వారు త్వరగా పైకి వెళ్తారు. ఇది ప్రవృత్తి మార్గము. ఎలాగైతే జంటను పరుగెత్తించినప్పుడు, ఒకరి కాలును మరొకరి కాలుతో కట్టి తర్వాత పరుగు తీస్తారు. ఇది కూడా మీ పరుగు పందెము కదా. అభ్యాసం లేని వారు క్రిందపడ్తారు. ఇందులో కూడా అలాగే అవుతుంది. ఒకరు ముందుకు పరుగెత్తితే, రెండవవారు అడ్డగిస్తారు. కొన్నిచోట్ల ఇద్దరూ క్రిందపడ్తారు. బాబా ఆశ్చర్యపడ్తారు - ముసలివారికి కూడా కామాగ్ని రగులుకుంటే వారు కూడా క్రిందపడ్తారు. వారు పడేశారని కాదు. క్రింద పడడం, పడకపోవడం మీ చేతిలో ఉంది. క్రింద ఎవ్వరూ పడేయరు. మరి మీరెందుకు క్రింద పడాలి. ఏం జరిగినా మనం క్రిందపడము, క్రింద పడితే ఆహారం(భాగ్యము) చెడిపోతుంది. గాఢంగా దెబ్బ తగులుతుంది. తర్వాత పశ్చాత్తాపపడ్తారు కూడా. ఎముకలు విరిగిపోతాయి. చాలా దెబ్బలు తగుల్తాయి. బాబా రకరకాలుగా అర్థము చేయిస్తూ ఉంటారు.

శివజయంతికి టెలిగ్రాములు ఎలా ఉండాలో కూడా తెలిపించారు. అవి చదువుతూనే మనుష్యులు

అర్థము చేసుకోవాలి. విచార సాగర మథనము చేసేందుకు బాబా సమయమిస్తారు. ఎవరైనా చూస్తే ఆశ్చర్యపడాలి. జాబులు చాలా వ్రాస్తారు. అందరూ 'బాప్‌దాదా' అని వ్రాస్తారు. శివబాబా తండ్రి అని, బ్రహ్మను దాదా అని అంటారని మీరు అర్థము చేయించవచ్చు. ఒక్కరినే ఎవరైనా 'బాప్‌దాదా' అని పిలుస్తారా? ఇది అద్భుతమైన విషయం. ఇందులో సత్య-సత్యమైన జ్ఞానముంది. కాని స్మృతిలో ఉంటే ఎవరికైనా బాణం కూడా తగులుతుంది. క్షణ-క్షణము దేహాభిమానములోకి వచ్చేస్తారు. ఆత్మాభిమానులుగా అవ్వండి అని తండ్రి చెప్తున్నారు. శరీరాన్ని ధరించి పాత్ర చేసేది ఆత్మనే. ఎవరైనా మరణించినా ఏ చింతా లేదు. ఆత్మలో ఏ పాత్ర నిర్ణయించబడిందో దానిని మనం సాక్షిగా ఉండి చూస్తాము. అది ఒక శరీరాన్ని వదిలి మరొకటి తీసుకొని పాత్ర చేస్తుంది. ఇందులో మనమేం చెయ్యలేము. ఈ జ్ఞానము కూడా మీ బుద్ధిలో ఉంది. అయితే అది కూడా నెంబరువారుగా ఉంటుంది. చాలా మంది బుద్ధిలో అయితే నిలువనే నిలువదు. కనుక వారు ఎవ్వరికీ అర్థము చేయించలేరు. ఆత్మ వేడి పెనము వలె తమోప్రధానమై పతితంగా ఉంది. దాని పై జ్ఞానామృతము కురిపించినా నిలువదు. ఎవరు చాలా భక్తి చేశారో వారికి బాణం తగుల్తుంది. వెంటనే ధారణ అవుతుంది. ఇది అద్భుతమైన లెక్క. మొదటి నెంబరు పావనంగా ఉన్నవారే మళ్లీ పతితంగా అవుతారు. ఇవి కూడా చాలా అర్థము చేసుకోవాల్సిన విషయాలు. అదృష్టంలో లేకుంటే చదువునే వదిలేస్తారు. బాల్యము నుండే జ్ఞానములో మగ్నమై ఉంటే, ధారణ అవుతూ ఉంటుంది. వీరు చాలా భక్తి చేశారని అర్థము చేసుకుంటారు. చాలా చురుకుగా అవుతారు. ఎందుకంటే అవయవాలు పెద్దవైనందున బాగా అర్థము కూడా చేసుకుంటారు. శరీరము, ఆత్మ రెండింటి వైపు గమనమిస్తే ఆ ప్రభావం తొలగిపోతుంది. ఇది ఈశ్వరీయ చదువు. తేడా ఉంది కదా. కాని ఆ పట్టుదల ఉండాలి కదా.

**మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.**

**ధారణ కొరకు ముఖ్య సారము :-**

1. ఆత్మిక సైన్యంగా తయారై పంచ వికారాల పై విజయం పొందాలి. తప్పకుండా పవిత్రంగా అవ్వాలి. శ్రీమతమునను సరించి భారతదేశాన్ని పావనంగా చేయు సేవ చేయాలి.
2. ఈ అనంతమైన నాటకంలో ప్రతి పాత్ర ఆత్మాభిమానులుగా అయి నటించాలి. ఎప్పుడూ దేహాభిమానములోకి రాకూడదు. సాక్షిగా ఉండి ప్రతి ఒక్కరి పాత్రను చూడాలి.

## వరదానము :- " స్వమానం ద్వారా అభిమానాన్ని సమాప్తం చేసే సదా నిర్మాన్ (నిరహంకారి) భవ "

ఏ పిల్లలైతే స్వమానంలో ఉంటారో వారికి ఎప్పుడూ అభిమానం రాజాలదు, వారు సదా నిర్మానులుగా (నిరహంకారులుగా) ఉంటారు. ఎంత పెద్ద స్వమానమో అంత హా జీ అని అనడంలో నిరహంకారులు. చిన్న, పెద్ద, జ్ఞాని, అజ్ఞాని, మాయాజీతులు లేక మాయకు వశమైనవారు, గుణవంతులైనా లేక ఒకటి, రెండు అవగుణాలు గలవారైనా అనగా గుణవంతులుగా అయ్యేందుకు పురుషార్థము చేయువారైనా, స్వమానంలో ఉండేవారు అందరికి గౌరవమిచ్చే దాతలుగా ఉంటారు అనగా స్వయం సంపన్నంగా ఉన్న కారణంగా సదా దయాహృదయులుగా ఉంటారు.

## స్లోగన్ :- " స్నేహమే సహజంగా స్మృతి చేసేందుకు సాధనం. అందువలన సదా స్నేహీలుగా ఉండాలి, స్నేహీలను తయారు చేయాలి. "